క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు



చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ పద్మావతి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) వైద్యులు చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే డాక్టర్ పద్మావతి చిన్నారుల ఆరోగ్యం, ఎత్తు, బరువును పరిశీలించారు. పిల్లల్లో అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించి నయం చేయవచ్చని అన్నారు. జ్వరం, జలుబు ఇతర సమస్యలను ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాణి, అంగన్‌వాడీ టీచర్ సుగుణ పాల్గొన్నారు.

చేగుంటను మర్చిపోలేను



నాయకులతో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

చేగుంట(తూప్రాన్): చేగుంటను ఎప్పటికీ మర్చిపోనని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం మండలంలోని వడియారం గ్రామంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ ఇంటికి వచ్చిన ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా పని చేసినపుడు స్థానికులు అందించిన సహకారం మర్చిపోలేను అన్నారు. ఆయన వెంట సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు ఉన్నారు.

హరితహారం



మొక్కలు నాటుతున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో శనివారం సర్పంచ్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ కూలీలు గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. నాటిన ప్రతీ మొక్కను రక్షించేలా చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ ముత్తు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న సర్వన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను తొలగించిన వారిపై చర్య తీసుకోవాలని బద్రియా సర్పంచ్ బుజ్జిబాయి భర్త సర్వన్ కోరారు. ఈ విషయమపై శనివారం ఆయన పోలీస్‌లకు ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పల్లె ప్రగతిలో నాటిన మొక్కలను పంచాయతీ అనుమతి లేకుండా తొలగించారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గడువు ముగిసిన సరుకుల విక్రయం



గడువు ముగిసిన ప్యాకెట్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని ఓ హోల్‌సేల్ దుకాణంలో గడువు ముగిసిన సరుకులు విక్రయిస్తున్నట్లు తెలిసింది. శనివారం నర్సాపూర్‌కు చెందిన అశోక్‌రెడ్డి పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో హెయిర్ డై ప్యాకెట్‌లు కొనుగోలు చేయగా.. ప్యాకెట్‌పై గడువు ముగిసినట్లు గుర్తించారు. గడువు ముగిసిన వస్తువులను ఎలా అమ్ముతారని నిర్వాహకులను ప్రశ్నించగా.. ఇష్టం ఉంటే కొనండి.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని వాపోయాడు. సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

పరీక్ష రాసి ఏడాది.. ఫలితమేది?

- అభ్యర్థులకు తప్పని ఎదురుచూపులు
- మీసేవా సెంటర్లు లేక ప్రజల ఇక్కట్లు
- దరఖాస్తు చేసుకునేందుకు పక్క మండలాలకు..



మీసేవా కేంద్రం వద్ద జనాల రద్దీ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ మండలం ఏర్పడి ఏడేళ్లు అవుతున్నా.. మండలంలో మాత్రం సౌకర్యాల కొరత వేధిస్తూనే ఉంది. మండలంలో మీసేవా కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం అన్ని పనులు ఆన్‌లైన్ ద్వారా జరుగుతుండడం, సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం స్థానికంగా మీసేవా సెంటర్లు లేక పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తోంది. మండల కేంద్రంతో పాటు, చిట్కుల్ గ్రామంలో మీసేవా కేంద్రాల ఏర్పాటుకు ఏడాది క్రితం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో చిలప్‌చెడ్‌లో 33 మంది, చిట్కుల్‌లో 31 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఏడాది క్రితం అభ్యర్థులకు రాత పరీక్ష కూడా నిర్వహించారు. కానీ ఇప్పటి వరకు ఫలితాలను ప్రకటించలేదు. దీంతో సదరు అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

పక్క మండలాలకు..

- విద్యార్థులు నివాస, కుల, ఆదాయ ధ్రువ పత్రాలు పొందాలంటే, ఉపకార వేతనాలు, చదువుకున్న అభ్యర్థులు ఏవైనా దరఖాస్తు చేయాలన్న ఆన్‌లైన్ తప్పనిసరి.
- రెవెన్యూ సంబంధిత దరఖాస్తులు, కల్యాణలక్ష్మి, డ్రైవింగ్ లైసెన్స్‌లు ఆన్‌లైన్‌లోనే చేయాల్సి రావడంతో ప్రజలు ఇబ్బందులు ప డుతున్నారు.
- మండల కేంద్రంలో మీసేవా సెంటర్లు లేకపోవడంతో రైతులు, విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు.
- చదువుకోని వారి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.
- మండలం ఏర్పాటు కాక ముందు ఈ పనులకు గతంలో పక్క మండలాలకు వెళ్లాల్సి వచ్చేది.
- చిలప్‌చెడ్ మండలంగా ఏర్పాటైన తర్వాత కూడా అదే పరిస్థితి వచ్చింది. దీంతో మండలంలోని ప్రజలు మండలం ఏర్పడిన ఎలాంటి ప్రయోజనం లేదని, గతంలో మాదిరిగా ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.
- ఎప్పటి మాదిరిగానే సమయం కూడా వృథా అవుతుందని మండల వాసులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మండలంలో మీ సేవా కేంద్రం కోసం దరఖాస్తు చేసి పరీక్ష రాశాను. పరీక్ష రాసి సంవత్సరం అయిన ఎలాంటి ఫలితం లేదు. మండలంలో మీ సేవా ఏర్పాటు అయ్యేలా లేదని, మండల కేంద్రంలో ఇంటర్నెట్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నా. ఇకనైనా మండలంలో మీసేవా కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – శ్రీకాంత్‌గౌడ్

త్వరగా ఏర్పాటు చేయాలి



మండలంలో ఇప్పటి వరకు మీసేవా కేంద్రం లేకపోవడం బాధకరం. ఆదాయ, కుల ధ్రువపత్రాల దరఖాస్తులకు అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో రెండు గ్రామాల్లో కేంద్రం వచ్చే అవకాశం ఉన్న, అభ్యర్థులు అర్జీలు పెట్టుకున్న ఇప్పటి వరకు మీసేవా కేంద్రంలేదు. – లక్ష్మణ్

ఆదేశాలు రాలేదు



మండలంలో రెండు గ్రామాల్లో మీసేవా కేంద్రాలకు ఏర్పాటుకు పరీక్షలు జరిగిన విషయం వాస్తవమే. కేంద్రాల ఏర్పాటుకు అభ్యర్థులు ఎదురుచూస్తున్నప్పటికీ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మీసేవా కేంద్రాలు ఏర్పాటయ్యేలా చర్య తీసుకుంటాం. – ఆదర్శ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్

వైద్యులది దేవుడి స్థానం



వైద్యులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్‌జోన్: వైద్యోనారాయణహరి అంటూ వైద్యులను దేవుడితో పోల్చుతారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. డాక్టర్‌డే సందర్భంగా శనివారం మెదక్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కేక్‌కట్ చేసి వైద్యులను శాలువతో సన్మానించారు. నిస్వార్థంగా వైద్యులు చేసే సేవలను ప్రజలు ఎప్పుడు మరిచిపోరన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి చందూనాయక్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పీసీ శేఖర్, శేఖర్, కిరణ్ తదితరులు ఉన్నారు.

రేగోడ్‌లో...

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులను సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు గంజి సంగమేశ్వర్, చోటుమియా, జయరాజ్, ఎస్.దిగంబర్ రావు, యాదగిరి పాల్గొన్నారు.

రామాయంపేటలో...

రామాయంపేట(మెదక్): లయన్స్‌క్లబ్, స్నేహబంధు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో, ఆవాస విద్యాలయంలో రెండు క్లబ్‌ల ప్రతినిధులు వేర్వేరుగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

చేగుంటలో...

చేగుంట(తూప్రాన్): చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్లను సన్మానించారు. అనంతరం అంగన్‌వాడీ పిల్లలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులు అనిల్‌కుమార్, నాగరాజు, లింగమూర్తి, సుఖేందర్, వీరబ్రహ్మం, సిద్ధిరాములు, నర్సింలు, రామిరెడ్డి పాల్గొన్నారు.

శనీశ్వరుడికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో శనివారం శనిత్రయోదశి సందర్భంగా పూజారులు పూజారులు మురళీధర్‌శర్మ, రవి ప్రసాద్‌శర్మ, ఉమాశంకరశర్మ ఆధ్వర్యంలో శనేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ తైలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. దీంతోపాటు సర్పంచ్ కాజిపేట రాజేందర్, రవిసాగర్, బాలింగం, రాజు, కౌడిపల్లి ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్ తదితరులు, భక్తులు పూజలు చేశారు.

లయన్స్ క్లబ్ నూతనకార్యవర్గం



గంజి సంగమేశ్వర్

రేగోడ్(మెదక్): లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు రీజినల్ చైర్మన్ ఎస్.దిగంబర్‌రావు శనివారం తెలిపారు. లయన్స్ క్లబ్ చైర్మన్‌గా గంజి సంగమేశ్వర్, కార్యదర్శిగా చోటుమియా, ట్రెజరీగా జయరాజ్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దిగంబర్‌రావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేసి క్లబ్‌కు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ యాదగిరి, సభ్యులు నాగిరెడ్డి నర్సింహారెడ్డి, గాండ్ల నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్‌రావు, లచ్చునాయక్, పాంపాటి రాములు, శ్రీకాంత్ నాయక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పూజారులు అభిషేకం, పూజలు నిర్వహించారు. సత్యనారాయణస్వామి మండపంలో దంపతులు సామూహిక వ్రతాలు ఆచరించారు. దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఈఓ సార శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, శ్రీవాత్సవ్‌శర్మ, తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

సంక్షిప్త వార్తలు

◆ కల్తీ పెట్రోల్‌తో నిలిచిన వాహనాలు

తూప్రాన్: కల్తీ పెట్రోల్‌తో వాహనాలు నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటన మండలంలోని నాగులపల్లి శివారులోని 44వ జాతీయ రహదారిపై స్టేషన్ మాసాయిపేట వద్ద పెట్రోల్ బంకులో శనివారం చోటు చేసుకుంది. బంకులో పెట్రోల్ పోయించుకున్న వాహనదారులు కొద్ది దూరం వెళ్లగానే వాహనం నిలిచిపోవడంతో మెకానిక్‌ను సంప్రదించారు. పెట్రోల్‌లో కల్తీ జరిగినట్లు గుర్తించి బంకు వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వినియోగదారులకు నచ్చజెప్పారు. పెట్రోల్ బంకు నిర్వాహకులు మాత్రం పెట్రోల్‌లో కలిసే ఇథనాల్ శాతం అధికంగా ఉండడంతో వాహనాలు మొరాయించినట్లు వివరించారు. వెంటనే ఇతర వాహనాల్లో పెట్రోల్ పోయడం నిలిపివేశారు.

◆ 4న క్రీడా పాఠశాలకు ఎంపిక

చేగుంట(తూప్రాన్)/శివ్వంపేట(నర్సాపూర్): తెలంగాణ క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతి చదివే విద్యార్థులకు ఈ నెల 4న ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు ఏంఈఓ బుచ్చానాయక్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సర్టిఫికెట్స్‌తో రావాలని, పూర్తి వివరాలకు పీడీ శారద 9390013150, పీఈటీ నాగరాజు 9866546563ను సంప్రదించాలన్నారు.

◆ 5న పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): తెలంగాణా క్రీడా పాఠశాలలో 4, 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 5న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక నిర్వహిస్తామని మండల ఇన్‌చార్జ్ విద్యాధికారి బుచ్చానాయక్ తెలిపారు. వివరాలకు 9398880233, 8500860193 నంబర్లలో సంప్రదించాలన్నారు.

◆ సమ్మె నోటీస్

వెల్దుర్తి(తూప్రాన్): గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 8నుంచి చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన నోటీస్‌ను శనివారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ ఆనంద్‌కు అందజేశారు. సమ్మె నోటీస్‌లో పొందుపర్చిన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించేలా ప్రత్యేక చొరవ చూపాలని కార్మికులు విజ్ఞప్తి చేశారు.

◆ ఉపాధ్యాయుల పరస్పర దూషణ

శివ్వంపేట(నర్సాపూర్): విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు వ్యక్తిగత దూషణలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. మండల కేంద్రం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు శనివారం గొడవ పడినట్లు తెలిసింది. పాఠశాలలకు వచ్చిన ఉపాధ్యాయులు పాఠాలు బోధించకుండా సెల్‌ఫోన్‌తో కాలక్షేపం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై హెచ్‌ఎం రమేష్‌ను వివరణ కోరగా, ఉపాధ్యాయుల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, బోధన సక్రమంగా సాగుతుందని తెలిపారు.

◆ గురు పౌర్ణిమ పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ ఆలయంలో సోమవారం గురుపౌర్ణిమ సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు సభ్యులు జిన్నారం పెద్దగొని శివకుమార్‌గౌడ్ తెలిపారు. పూజల అనంతరం అన్నదానం ఉంటుందన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి స్థల పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 9వ వార్డులో డ్రైనేజీ నిర్మాణానికి మున్సిపల్ అధికారులు శనివారం స్థల పరిశీలన చేశారు. ఈ కౌన్సిలర్ సునీత మాట్లాడుతూ వార్డుల నుంచి వచ్చే మురికి నీరు 9వ వార్డు మీదుగా బయటకు వెళ్లాల్సి ఉంటుందని, డ్రైనేజీ సరిగా లేకపోవడంతో నీరు రోడ్లపైకి చేరుతుందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు కాల్వ నిర్మాణం చేపట్టాలని అధికారులను కోరారు. ఆర్టీసీ బస్టాండ్ పక్కన స్థలం మధ్య నుంచి కాల్వ నిర్మిస్తే బాగుంటుందని అధికారులు ప్రతిపాదించగా.. ఆర్టీసీ ఆర్‌ఎం సుదర్శన్, డిపో మేనేజర్ రవిచందర్ వ్యతిరేకించారు. ఆర్టీసీ సంస్థకు చెందిన భూమిలో నుంచి కాకుండా పక్కన కుంటకట్ట నుంచి నిర్మించాలని సూచించారు. ఆర్టీసీ అధికారుల ప్రతిపాదనల మేరకు పీఆర్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈఈ రాధిక లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకట్ గోపాల్ స్థలాన్ని పరిశీలించారు.



ఇండియన్ బ్యాంకులో ఖాతాదారుల రద్దీ

ఖాతాదారుల ఇక్కట్లు

శివ్వంపేట(నర్సాపూర్): రైతుబంధు డబ్బులు తీసుకునేందుకు రైతులు నానా ఇక్కట్లు పడుతున్నారు. శనివారం శివ్వంపేట ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులతో కిక్కిరిసిపోయింది. రైతుబంధు డబ్బుల కోసం రైతులు, ఇతర బ్యాంకు లావాదేవీల కోసం వచ్చిన వారితో బ్యాంకు ఆవరణం నిండిపోయింది. గంటల తరబడి నిలబడాల్సి రావడంతో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



చిన్నశంకరంపేట: మాట్లాడుతున్న నాగరాజు



కొల్చారం: కరపత్రం అందజేస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్ ఎస్ఎల్ నాగరాజు అన్నారు. శనివారం చిన్నశంకరంపేట మండలం మల్లుపల్లి, సంగాయిపల్లి, శాలిపేటలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అందిస్తున్న నిధులు, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలని, బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోగుల రాజు, మాజీ సర్పంచ్ మూర్తి పెద్దులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సురేష్‌గౌడ్, రాజు యాదవ్ పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్): మహా జనశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు దయాకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్రం పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరాజు, తుక్కాపూర్ బూత్ అధ్యక్షుడు అయిలి కృష్ణ, ప్రధాన కార్యదర్శి శివప్పగారి సతీష్, ఉపాధ్యక్షుడు అయిలి శేఖర్, సోషల్ మీడియా కన్వీనర్ శివాజీ గ్రామ బూత్ కమిటీ సభ్యులు లక్ష్మణ్, శివ శంకర్, అరవింద్, మహేందర్, చంద్రప్ప బసప్ప, చంద్రప్ప, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్, మెల్లూర్, మానెపల్లి, మన్నెవారి జలాల్‌పూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్రం పథకాలను వివరించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన విస్తారక్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీని అధికారంలో తేవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింలు, మాజీ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నవీన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయొద్దు



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కౌడిపల్లి(నర్సాపూర్): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని కైలాష్ సత్యర్థి ఫౌండేషన్ సెంటర్ ఫర్ ఆక్షన్ రీసెర్చ్ పీపుల్స్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సక్రుబాయ్, ఆర్గనైజర్ మమత అన్నారు. శనివారం మండలంలోని వెల్మకన్న ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడంవల్ల శారీక, మానసిక ఎదుగుదల లేకపోవడంతో భవిష్యత్‌లు ఇబ్బందులు వస్తాయన్నారు. పెళ్లీడు వచ్చిన తరువాతే వివాహం చేయాలని, పిల్లలతో పనులు చేయించడం సరికాదన్నారు. బడీడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి అభివృద్ధిలోనికి రావాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరోజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా విఠలేశ్వర కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట ఆలయంలో శ్రీ రుక్మిణీవిఠలేశ్వర కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో ప్రత్యేకంగా వేసిన మండపంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కనులపండువగా కల్యాణం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం సాయంత్రం స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు.

క్రీడలపై దృష్టి సారించాలి

మెదక్ మున్సిపాలిటీ: చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్ అన్నారు. శనివారం జంబికుంట క్రికెట్ టీం సభ్యులకు ట్రాక్‌సూట్‌ను అందజేశారు. కార్యక్రమంలో జంబికుంట క్రికెట్ టీమ్ కెప్టెన్ చిదంబరం, శమీర్ శైలాని, ముజామిల్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



జెర్సీ అందజేస్తున్న అశోక్